సాక్షి
శ్రీకాకుళం

శనివారం । 22 । ఏప్రిల్ । 2023



విద్యా బోధన ఇలాగేనా..?

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ జిల్లాలో పర్యటించారు. పలువురిపై చర్యలకు ఆదేశించారు. - IIలో



నేడు రంజాన్

టెక్కలి: జిల్లావ్యాప్తంగా శనివారం రంజాన్ జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా సంతబొమ్మాళి మండలం పాలతలగాంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	37°	26°
ఇచ్ఛాపురం	38°	25°
పాతపట్నం	37°	25°
శ్రీకాకుళం	38°	25°

న్యూస్‌రీల్

నేటి నుంచి జిల్లాలో చిరుజల్లులు

ఆమదాలవలస: వాతావరణంలో వచ్చే మార్పుల కారణంగా శనివారం నుంచి ఈ నెల 26 వరకు శ్రీకాకుళం జిల్లాలో అక్కడక్కడా చిరుజల్లులతో పాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ మౌనిక శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ వర్షాన్ని రైతులు వినియోగించుకుని వరి, నువ్వులు, వేసవి పెసర, చెరుకు పంటల్లో పైపాటు ఎరువులు వేసుకోవచ్చునని సూచించారు.

నీలగిరి తోటలో అగ్ని ప్రమాదం

ఎచ్చెర్ల క్యాంపస్: భగీరథపురం పరిధిలోని నీలగిరి తోటల్లో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గాలులు బలంగా ఉండటంతో 50 ఎకరాల్లో మంటలు ఎగిసి పడ్డాయి. స్థానిక అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. ప్రమాదానికి కారణం తెలియరాలేదు. 29 మంది వరకు రైతులకు చెందిన తోటలు ఉంటాయి. రైతులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. నష్టంపై అధికారులు అంచనా వేస్తున్నారు.

చిరుత పులి సంచారం అవాస్తవం

వజ్రపుకొత్తూరు రూరల్: బెండి గేటు పై ఓవర్ వద్ద చిరుత పులి సంచరిస్తున్నట్లు సోషల్ మీడియాలో శుక్రవారం విపరీతంగా ప్రచారం జరిగింది. అయితే ఇది తప్పుడు ప్రచారమని కాశీబుగ్గ అటవీ శాఖాధికారి ఎ.మురళీకృష్ణ నాయుడు స్పష్టం చేశారు. అనంతపురంలో చిత్రీకరించిన దృశ్యాలను బెండిగేటు పరిసరాల్లో సంచరిస్తున్నట్లు తప్పుగా ప్రచారం చేశారని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎలాంటి చిరుత పులి సంచారం లేదని, ప్రజలు భయాందోళన చెందాల్సిన పని లేదని అన్నారు.

29న టిడ్కో ఇళ్లు ప్రారంభం



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

శ్రీకాకుళం రూరల్: ఈ నెల 29న టిడ్కో ఇళ్లను ప్రారంభించనున్నట్లు టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పాత్రునివలసలో నిర్మితమైన టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.150 కోట్లతో ఈ టిడ్కో ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించిందని చెప్పారు. 29న లబ్ధిదారులకు ఇళ్లను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే నాగావళి నదిలో సురక్షిత మంచినీటి సరఫరా పనులు కూడా తుది దశకు చేరుకున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం పాత్రునివలసలో నిర్మాణం జరిగిన 1280 టిడ్కో ఇళ్లకు సంబంధించి హౌసింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులు వంద శాతం పూర్తయ్యాయని సంబంధిత ఇంజినీరింగ్ అండ్ కాంట్రాక్ట్ ఏజెన్సీ సిబ్బంది టిడ్కో చైర్మన్‌కు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేషు, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్‌కుమార్, టిడ్కో సూపరింటెండెంట్ ఇంజినీర్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నీలమణి దుర్గమ్మ మహోత్సవాలు



విద్యుత్ కాంతులతో అమ్మవారి ఆలయం

పాతపట్నం: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు పాతపట్నం నీలమణి దుర్గమ్మ మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. 30వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు ఘనంగా అమ్మవారి 48వ వార్షిక నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నామని ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

23న శశిలో ఐఐటీ, నీట్‌పై అవగాహన

తగరపువలస (విశాఖ జిల్లా): పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు సంగివలస శశి విద్యాసంస్థల్లో ఈ నెల 23న ఐఐటీ, నీట్‌పై అవగాహన కలిగిస్తున్నట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఐఐటీ జేఈఈ, నీట్ పరీక్షలపై సందేహాలను తీరుస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా క్రాంతిసుధ తెలిపారు. మరిన్ని వివరాలకు 97059 25599, 97056 35599 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సమ్మర్ స్పెషల్

● వేసవిలో శిక్షణ

సమయమిదే మిత్రమా



విద్యా సంవత్సరం ముగుస్తోంది. పిల్లలకు వేసవి సెలవులు దగ్గరపడుతున్నాయి. బంధువుల ఇళ్లకు వెళ్లడం, టూర్లు ప్లాన్ చేయడం వంటి ప్లాన్లు ప్రతి ఇంటిలోనూ ప్రస్తుతం ముసాయిదా దశలో ఉంటాయి. అయితే వేసవికి ఇంకో ఆప్షన్ కూడా ఉంది. ఏడాదంతా పుస్తకాలతో కుస్తీ పట్టే వారు తమకు ఇష్టమైన రంగంలో ఈ సెలవుల్లో ఎంచక్కా శిక్షణ తీసుకోవచ్చు. పాటలు నేర్చుకోవడం, ఏదైనా సంగీత పరికరం వాయించడంలో తర్ఫీదు తీసుకోవడం, నచ్చిన ఆటలో ప్రావీణ్యత సంపాదించడం.. ఇలా తమ అభిరుచి మేరకు కళలు, క్రీడల్లో నైపుణ్యాన్ని పెంచుకోవడానికి సమ్మర్ సెలవులు ఉపయోగపడతాయి. అందుకు తగ్గట్టుగానే జిల్లా కేంద్రంలో వేసవి శిక్షణ శిబిరాలు సిద్ధమవుతున్నాయి.

- జిల్లా కేంద్రంలో వేసవి శిక్షణ శిబిరాలు
- అన్ని రకాల కళలపై తర్ఫీదు

శ్రీకాకుళం కల్చరల్ : జిల్లాలో వేసవి శిక్షణ శిబిరాలకు పలు సంస్థలు సిద్ధమవుతున్నాయి. శాస్త్రీయ సంగీతంపై నేటి యువతకు ఆసక్తి పెరుగుతోంది. పిల్లలను కూడా సంగీతం నేర్చుకోమని తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. అలాగే ఇంకొన్ని కళల్లోనూ చేరుస్తున్నారు. వీరికి శిక్షణ ఇవ్వడానికి 30 రోజులు, 45రోజుల పాటు తరగతులను ఏప్రిల్ 24నుంచి, మరికొందరు మే ఒకటి నుంచి ప్రారంభిస్తున్నారు. వేసవి శిబిరాల్లో కొన్నింటిని పరిశీలిస్తే..



సంగీత నిలయంలో సాధన చేస్తున్న దృశ్యం (ఫైల్)

కీబోర్డు, గిటార్, వోకల్

- సంగీత విభాగంలో కత్తెరవీధిలోని శ్రీ రాజరాజేశ్వరి సంగీత పీఠం వారు గాత్రం, వయోలిన్, కీ-బోర్డు, మృదంగంలపై శిక్షణ కూడా ఇస్తారు.
  వివరాలకు: 94405 13579
- పట్టణంలో పాండురంగవీధిలో ఉన్న వీఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో కీబోర్డు, గిటార్, వోకల్ శిక్షణ ప్రారంభమైంది. మాస్టర్ సీహెచ్. వేంకటరావు ఆధ్వర్యంలో వేసవిలో రెండు నెలలపాటు ఈ శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.
  వివరాలకు: 93906 11285



గిటార్ నేర్చుకుంటున్న యువకులు

నృత్యం

- సంప్రదాయం కూచిపూడి గురుకులం, కళ్లేపల్లిలో కూచి పూడి నృత్యం, కర్ణాటక సంగీతంపై వేసవి శిక్షణ తరగతులు ఏప్రిల్ 24 నుంచి మే 10 వరకు జరుగుతాయి. అక్కడికి వెళ్లేందుకు బస్సు సదుపా యం కూడా ఉంది.
  వివరాలకు: 94406 81083
- వంశధార కాలనీలోని శివశ్రీ నృత్య కళానికేతన్‌లో మే 1 నుంచి జూన్ 10 వరకు కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యం నేర్పిస్తారు. రఘుపాత్రుని శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ జరగనుంది.
  వివరాలకు: 94405 50330
- శాంతినగర్ కాలనీ మూడో లైనులో శ్రీ సత్యసాయి నృత్య కళానికేతన్‌లో మే 1నుంచి జూన్ 10 వరకు శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యాలు నేర్పుతారు. ఎస్‌వీ కవిత తర్ఫీదు ఇస్తారు.
  వివరాలకు: 99515 43434
- తిమ్మరాజు నీరజ అభినయ నృత్యనికేతన్‌లో మే 1నుంచి జూన్ 10 వరకు సాయంత్రం 5 గంటల నుంచి భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్యం, సంగీతం నేర్పిస్తారు.
  వివరాలకు: 97055 37328





నృత్య శిక్షణ ఇస్తున్న శ్రీకాంత్

సంగీతం

రెడ్డి సత్యనారాయణ శృతిలయ సంగీత శిక్షణాలయంలో ఏప్రిల్ 24 నుంచి మే 31 వరకు శాస్త్రీయ సంగీతంలో ప్రాథమిక అంశాలు, భక్తి, దేశభక్తి, లలిత గీతాలు, భజన్స్, కీబోర్డు, ట్రాక్ సింగింగ్, తబలా, డోలక్, ఎలక్ట్రానిక్స్ రిథమ్స్ నేర్పుతారు.
వివరాలకు: 95027 57479

- మొండేటి వీధిలో మల్లెమొగ్గల లక్ష్మీ, షిరిడిసాయి సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులను మే 1నుంచి జూన్ 9 వరకు సాయంత్రం 4 గంటల నుంచి నిర్వహిస్తారు. అన్న మయ్య సంకీర్తనలు, భక్తి సంగీతం నేర్పుతారు.

లెక్కల చిక్కులు విప్పుదాం



- వేసవిలో చిన్నారులకు లెక్కలు నేర్పించేందుకు పట్టణంలోని మాధవ్ మోటార్స్ పక్కన గల అబాకస్ వేదిక్ మ్యాథమెటిక్స్ వారు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 27 నుంచి ఇక్కడ 2 నుంచి 5వ తరగతి వరకు ప్రాథమిక స్థాయి, ఆపైన 6నుంచి 9 వ తరగతి స్థాయి వాళ్లకు నేర్పుతున్నారు. దీంతో పాటుగా హ్యాండ్ రైటింగ్ పైన కూడా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.
  వివరాలకు: 99488 19718


చిత్రలేఖనం



- పాతశ్రీకాకుళం కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో డ్రాయింగ్‌పై ఉచిత వేసవి శిక్షణ నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్ ఎల్.నందికేశ్వరరావు తెలిపారు.
  వివరాలకు: 94410 72761

కరోనా ఘంటిక

- జిల్లాలో మళ్లీ కోవిడ్ కేసులు
- రిమ్స్‌లో ఐదుగురు వైద్యులు, ఒక పీజీ విద్యార్థికి పాజిటివ్
- లక్షణాలు ఉన్న వారు పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం
- గ్రామస్థాయిలోనే వైద్యానికి ప్రభుత్వం చర్యలు



శ్రీకాకుళం: జిల్లాలో కరోనా ప్రమాద ఘంటిక మరో మారు మోగింది. దాదాపు అందరూ మర్చిపోయిన వేళ జిల్లాలో కొత్తగా కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదు కావడం కలకలం రేపుతోంది. జిల్లా కేంద్రంలో ఉన్న రిమ్స్‌లోని ఐదుగురు వైద్యులు, ఒక పీజీ విద్యార్థి కరోనా బారినపడి ప్రస్తుతం ఐసోలేషన్‌లో ఉన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోనే ఓ బ్యాంకులో ముగ్గురు ఉద్యోగులకు పాజిటివ్‌గా నిర్ధారణ జరిగింది. వీరంతా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పరీక్ష చేయించుకోవడంతో కరోనా కేసులు బయటపడ్డాయి. అయితే లక్షణాలు ఉన్నా చాలామంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పరీక్షలు చేయించుకోవడం లేదు. వీరి వల్ల వ్యాధి మరింత వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని వైద్యులంటున్నారు. సామాజిక దూరం పాటించడం, మాస్క్ ధరించడం, చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరిగే బలమైన ఆహారం తీసుకోవడం మళ్లీ అలవాటు చేసుకోవాలి.



రిమ్స్‌లో ఏర్పాటు చేసిన కరోనా వార్డు

పల్లెల్లోనే వైద్యం

రాష్ట్ర ప్రభుత్వం కరోనా బారిన పడే వారికి గ్రామస్థాయిలోనే వైద్యం అందజేసేందుకు నిర్ణయం తీసుకుంది. సచివాలయాల్లోని ఆరోగ్య కార్యకర్త వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి, వారికి పరీక్ష జరిపించి, పాజిటివ్‌గా నిర్ధారణ జరిగితే అవసరమైన మందులను వారికి అందజేసి, ఐసోలేషన్‌లో ఉంచేటట్లు చర్యలు తీసుకుంటారు. ప్రతి రోజు వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి లక్షణాలు తీవ్రమైతే సమీపంలోని ఏరియా ఆస్పత్రి, సబ్ సెంటర్‌లకు తరలిస్తారు. ఇంకా అవసరమైతే జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలిస్తారు. అన్ని ఏరియా ఆస్పత్రుల్లోనూ ఆక్సిజన్ సిలిండర్లు, అవసరమైన మందులను సిద్ధం చేశారు.

వార్డులు సిద్ధం



రిమ్స్‌లో కరోనా రోగుల కోసం ప్రత్యేక వార్డులను సిద్ధం చేశాం. మందులు కూడా సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుత వేరియెంట్ వల్ల ప్రమాదం లేకపోయినా జాగ్రత్తలు పాటించడం అవసరం. కోవిడ్ తగ్గిపోయినా దుష్ప్రభావాలు తర్వాత కూడా ఉంటాయి. – డాక్టర్ కె.సునీల్ నాయక్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్

రిమ్స్‌లో ప్రత్యేక వార్డు

శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో కరోనా బాధితుల కోసం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. ఇందులో 150 పడకలు ఉన్నాయి. మొత్తం 930 పడకల ఆస్పత్రి కాగా దాదాపుగా అన్ని బెడ్లకు ఆక్సిజన్ అందించే సౌకర్యం ఉంది. అయితే ఇటీవల కొన్ని చోట్ల మరమ్మతులు రావడంతో 700 పడకల వరకు ఆక్సిజన్ అందించే సౌకర్యం ఉంది. గతంలో వ్యాధి విజృంభించినప్పుడు రెండు లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్లు నెలకొల్పడంతో 700 పడకలకు నిరంతరంగా వారం నుంచి పది రోజుల పాటు సరఫరా చేయగల సౌలభ్యం కలిగింది. ప్రభుత్వం ఎన్ని సౌకర్యాలు కల్పించినా, ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే వ్యాధి అదుపులో ఉంటుందని వైద్యులంటున్నారు.

కుక్కలు రాసిన మృత్యుగీతం



కొద్దిసేపటి క్రితం వరకు తన చిన్నారి తనయ చేసిన చిలిపి చేష్టలు చూసి ఆ తల్లి మురిసిపోయింది. అలసిన చిట్టి తల్లిని నిద్ర పుచ్చి తన పనిలో పడింది. కానీ అంతలోనే జరగరాని దారుణం జరుగుతుందని ఏమాత్రం ఊహించలేదు. చిన్నారిని కుక్కలు ఎత్తుకెళ్లాయని తెలిసి ఆందోళనతో పరుగులు తీసింది. కానీ అప్పటికే ఆలస్యమైంది. ఆ ఇంటి దీపం మలిగిపోయింది. వీధి కుక్కల దాడిలో చిన్నారి సాద్విక బలై పోయింది. ఆ కుటుంబమే కాదు.. ఆ ప్రాంతమంతా విషాదంలో మునిగిపోయింది.



సాద్విక(ఫైల్)

- వీధికుక్కల దాడిలో పసిపాప మృతి
- మెట్టవలస గ్రామంలో దుర్ఘటన
- తల్లడిల్లిన తల్లిదండ్రులు

జి.సిగడాం/రాజాం సిటీ: మెట్టవలస గ్రామానికి చెందిన పైల రాంబాబు, రామలక్ష్మీ దంపతుల రెండో కుమార్తె సాద్విక (1) కుక్కల దాడిలో శుక్రవారం మృతి చెందింది. రాంబాబు దంపతులు రాజాం, పొందూరు ప్రధాన రహదారిలో సీతామహాలక్ష్మి జ్యూట్ మిల్లు ఎదురుగా చిన్న టీ దుకాణం నడుపుకుంటూ బతుకుతున్నారు. సాయంత్రం 6 గంటల వరకు సాద్విక ఆటలాడుకుని అప్పుడే మంచంపై నిద్రపోయింది. ఈ లోగా ఊరకుక్కలు ఒకేసారి వచ్చి చిన్నారిపై దాడి చేశాయి. పాప గొంతును నోట కరిచి పక్కనే ఉన్న టేకు తోటలోకి ఈడ్చుకెళ్లాయి. చిన్నారి గట్టిగా అరవడంతో ఆమె సోదరి కుసుమ కుక్కలను చూసి తల్లికి విషయం చెప్పింది. తల్లి వెంటనే తోటకు వెళ్లి చూడగా.. కుక్కలు పసిపాపపై దాడిచేయడం కనిపించింది. వెంటనే ఆమె కేకలు పెట్టడంతో చుట్టుపక్కల ఉన్న వారు సంఘటన స్థలానికి చేరుకుని చిన్నారిని హుటాహుటిన రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స చేసి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించడానికి సిద్ధమవుతుండగా.. చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. ముద్దుగారే పసిపాప మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువుల గుండెలవిసేలా రోదించారు.

పాప తల్లిదండ్రులు వలస వెళ్లి బతికేవారు. పిల్లలు పుట్టడంతో ఏడాదిన్నర నుంచి గ్రామంలోనే కూలి నాలి చేసి జీవిస్తున్నారు. ఈ లోగా జ్యూట్ మిల్లు ఎదురుగా చిన్న టీ దుకాణం ఏర్పాటు చేసుకున్నారు. చిన్నారి ఇలాంటి ఘటనలో ప్రాణాలు కోల్పోవడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు.



రాజాం ఆస్పత్రిలో చిన్నారికి వైద్యసేవలు



రోదిస్తున్న తల్లి

శ్రమించినా ఫలితం దక్కలేదు

కుక్కల దాడిలో తీవ్ర గాయాలైన సాద్విక ప్రాణాలు నిలబెట్టేందుకు ఎంతో శ్రమించాం. అయినా ఫలితం దక్కలేదు. పాప గొంతును కుక్కలు కొరికేయడంతో పరిస్థితి విషమించింది. అప్పటికీ డాక్టర్లంతా కష్టపడ్డారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించేందుకు సిద్ధం చేశాం. కానీ పాప ప్రాణాలు కాపాడలేకపోయాం.

– ముంజేటి కోటేశ్వరరావు, వైద్యాధికారి

25న సర్టిఫికెట్ల పరిశీలన



విజయ్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో జనవరి 1, 2016 నుంచి డిసెంబరు 31, 2019 మధ్యలో (శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలో) ఉద్యోగం చేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులలో ఒకరికి వారి అర్హతను బట్టి కారుణ్య నియామకాలను చేపట్టనున్నట్లు ఆర్టీసీ డీపీటీఓ ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 25వ తేదీన విజయనగరం డీపీటీఓ కార్యాలయంలో చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 24వ తేదీన సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని ముందు సమాచారం ఇచ్చామని, కానీ అనివార్య కారణాల వల్ల 25కు మార్చామని తెలిపారు. అభ్యర్థులు ఈ మార్పును గమనించి ఈనెల 25వ తేదీన వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

రైతు ఇంటి వద్దకు పశువైద్య సేవలు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవీన్

శ్రీకాకుళం: జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామస్థాయిలో పాడి రైతులకు అందజేస్తున్న పశువైద్య సేవలను రైతుల ఇంటి వద్దనే అందేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో రైతులకు ఉపయోగపడేలా అనేక అంశాలపై చర్చించారు. పాడి, దుక్కి రైతులకు ఉపయోగపడేలా సంచార వాహనాల ద్వారా అందిస్తున్న పశువైద్య సేవలు రైతులకు అందేలా గ్రామస్థాయిలో ప్రచారం చేయాలన్నారు. చేయూత, పీఎం కేసీసీ 12 నెలలకు సంబంధించి ముందస్తు ప్రణాళికలను తయారు చేయాలన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ఎరువులకు ఇబ్బంది లేకుండా ముందస్తుగా కార్యాచరణ తయారు చేసుకోవాలని సూచించారు. సాగునీటి ఇబ్బందులు లేకుండా కాలువల్లో పూడికల తొలగింపు, షట్టర్ల మరమ్మతులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ జేడీ ఎం.కిశోర్ మాట్లాడుతూ 1962 సంచార పశువైద్య వాహనాలు జిల్లాలో పర్యటిస్తూ రైతుల ఇంటి వద్దకు సేవలు అందజేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి బోర్డు చైర్మన్ నేతాజీ, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ కె.శ్రీధర్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, చల్లా అలివేలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పాలనలో సివిల్ సర్వెంట్లు కీలకం



రుంకు అప్పారావును సత్కరిస్తున్న కలెక్టర్, జేసీ ఇతర అధికారులు

శ్రీకాకుళం: పరిపాలన యంత్రాంగంలో సివిల్ సర్వెంట్ల పాత్ర కీలకమని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. శుక్రవారం 16వ జాతీయ పౌరసేవల దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. దేశంలో వివిధ పబ్లిక్ సర్వీస్ విభాగాల్లో ఉన్న అధికారుల పనిని గుర్తించేందుకు ఏటా ఏప్రిల్ 21వ తేదీన సివిల్ సర్వీస్ దినోత్సవాన్ని నిర్వహించుకుంటారని గుర్తు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను, ప్రభుత్వ ఆశయాలను ప్రజలకు చేరవేయటంలో అంకిత భావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ కోవిడ్ వంటి మహమ్మారి విరుచుకుపడినప్పుడు ఎంతో ధైర్య సాహసాలతో జిల్లా యంత్రాంగాన్ని ముందుకు నడిపించారని గుర్తు చేశారు. 1997 బ్యాచ్‌కి చెందిన ఐఏఎస్ ఆర్.అప్పారావు, జిల్లా ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు మణికంఠ, టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి నిషాకుమారి మాట్లాడారు. అనంతరం ఆర్.అప్పారావు, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను సత్కరించారు.

అనారోగ్య బాధితులకు చెక్కు అందజేత



రాజశ్రీ తల్లిదండ్రులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, నాయకులు

టెక్కలి: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాలకు ఒక వైపు సంక్షేమ పథకాలు అందజేస్తూ.. మరో వైపు కష్టం కలిగిన ప్రతి ఒక్కరికీ ఆర్థిక సాయం అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానవత్వం కలిగిన మహోన్నతమైన వ్యక్తి అని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఇటీవల సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు శంకుస్థాపన పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు నందిగాం మండలం దేవుపురం పంచాయతీ కొండతెంబూరు గ్రామానికి చెందిన కుడుము శ్రీనివాసరావు, అన్నపూర్ణ దంపతులు వారి కుమార్తె రాజశ్రీ అనారోగ్య పరిస్థితులను వివరించారు. దీంతో తక్షణమే సీఎం సహాయ నిధి నుంచి రూ.5 లక్షలను మంజూరు చేశారు. ఈ మేరకు శుక్రవారం టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ చేతుల మీదుగా బాధితురాలు రాజశ్రీ తో పాటు తల్లిదండ్రులకు చెక్కును అందజేశారు. తమ కుమార్తె అనారోగ్య పరిస్థితి గురించి సీఎం వైఎస్ జగన్‌కు విన్నవించిన వెంటనే రూ.5 లక్షలు మంజూరు చేశారని బాధిత కుటుంబం వెల్లడించింది. తమకు సీఎం వైఎస్ జగన్‌ను కలిసేందుకు అవకాశం కల్పించిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, పంచాయతీ పెద్ద యర్ర చక్రవర్తికి రుణపడి ఉంటామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు యర్ర చక్రవర్తి, ఎం.గోపాలకృష్ణ, కె.నారాయణమూర్తి, పి.మోహన్‌రావు, ఆర్.ఢిల్లేశ్వరరావు, బలరాం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చురుగ్గా ఆరోగ్య సర్వే



పారిశుద్ధ్యాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ బృందం

అరసవల్లి: జిల్లా కేంద్రంలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే చురుగ్గా సాగుతోంది. డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి ఆధ్వర్యంలో బృందం శుక్రవారం ఆదివారంపేట పరిధిలోని పలు వీధుల్లో పర్యటించి ఆరోగ్య పరిస్థితులు, పారిశుద్ధ్య స్థితిగతులను పరిశీలించింది. మరో మూడు రోజుల పాటు సర్వే జరగనుంది. కార్యక్రమంలో వైద్యాధికారి దీపికాప్రియ, నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే సభ్యులు, ఏఎన్ఎం, ఆశావర్కర్లు, పలు విభాగాల అధికారులు విక్టర్‌బాబు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

23న తూర్పుకాపు సంగ్రామ మహాసభ



మాట్లాడుతున్న పిసిని చంద్రమోహన్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఈ నెల 23న శ్రీకాకుళం సప్తగిరి కల్యాణ మండపంలో జరగనున్న తూర్పుకాపు సంగ్రామ మహాసభ విజయవంతం చేయాలని తూర్పుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తూర్పుకాపు సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తూర్పుకాపులకు జరుగుతున్న అన్యాయం, భవిష్యత్తు కార్యాచరణపై చర్చిస్తామని తెలిపారు. జాతీయ స్థాయిలో తూర్పుకాపు నేతలంతా హాజరవుతారన్నారు. ఆలిండియా తూర్పుకాపు సంక్షేమ సంఘం జాతీయ కార్యవర్గం ఎన్నిక కూడా జరుగుతుందన్నారు. సమావేశంలో సంఘ జాతీయ కో–కన్వీనర్ కద్దాల శ్యామసుందరరావు, జిల్లా అధ్యక్షుడు కోయిలాపు శ్రీనివాసరావు, తూర్పుకాపు విశ్రాంత ఉద్యోగుల సంఘ నేత మత్స బుచ్చిబాబు, జిల్లా కార్యవర్గ నేతలు పాల్గొన్నారు.

23 నుంచి బీఎస్సీ ప్రాక్టికల్స్

ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): ఆంధ్రవిశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రంలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రాక్టికల్, పర్సనల్ కాంటాక్ట్ తరగతులు, వార్షిక పరీక్షలను ఈ నెల 23 నుంచి నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకులు ఆచార్య కె.విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 31 కేంద్రాల్లో వీటిని నిర్వహిస్తామన్నారు. శ్రీకాకుళం బాలుర ప్రభుత్వ కళాశాలను ఎంపిక చేసుకున్న అభ్యర్థులు శ్రీకాకుళం హెచ్‌పీఎస్ డిగ్రీ కళాశాలలో, విశాఖపట్నం బీవీకే కళాశాలను ఎంపిక చేసుకున్న విద్యార్థులు ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో పరీక్షలకు హాజరుకావాలని సూచించారు.

రేపు జాబ్‌మేళా

ఇచ్ఛాపురం: స్థానిక సత్యసాయి పాఠశాల ఆవరణలో ఆదివారం ఉదయం 10 గంటలకు జీఎంఆర్ రక్ష సెక్యూరిటీ సంస్థ ఆధ్వర్యంలో సెక్యూరిటీ గార్డుల ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సంస్థ మేనేజర్ అగ్గాల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 లోపు వయస్సు కలిగి 166 సెంటీమీటర్లు ఎత్తు కలిగి కనీస విద్యార్హత పదో తరగతి కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు. సత్యసాయి పాఠశాల చైర్మన్ భానుతేజ సౌజన్యంతో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

హరిపురంలో సొండి కులస్తుల సమావేశం రేపు

మందస: మండలంలోని హరిపురంలో ఈ నెల 23న సొండి కులస్తుల రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీ సొండికుల సంక్షేమ సంఘం కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు హరిపురం బజారువీధి సమీపంలో నిర్వహించే ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు రత్నాల కాశీవిశ్వనాథ్ చౌదరి, ప్రధాన కార్యదర్శి బెహరా రాజారావు హాజరవుతారని పేర్కొన్నారు. సభ్యులంతా హాజరుకావాలని కోరారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,150–00
బంగారం(22సి. 10గ్రా.)	56,050–00
వెండి (కిలో)	81,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 375.00
విజయనగరం	రూ. 37900
శ్రీకాకుళం	రూ. 379.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210

విద్యా బోధన ఇలాగేనా?

- తనిఖీలు లేకపోవడంతో ఉపాధ్యాయుల బోధన గాడితప్పింది
- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ మండిపాటు
- డిప్యూటీ డీఈఓ, ఇద్దరు ఎంఈఓలు, హెచ్‌ఎం, ఇద్దరు టీచర్లపై చర్యలకు ఆదేశం



కొత్తూరు: విద్యాశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

కొత్తూరు/హిరమండలం/సారవకోట: ప్రతి విద్యార్థి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి సుమారు రూ.75 వేలు ఖర్చు చేస్తోందని, అందుకు తగ్గ బోధన మాత్రం జరగడం లేదని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కొత్తూరు మండలం కడుము జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలోని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి విద్యాప్రగతిని స్వయంగా తెలుసుకున్నారు. 8వ తరగతి విద్యార్థిని బూరాడ జ్యోత్స్నతో పాటు పలువురు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వర్క్‌బుక్‌లు, నోట్స్‌లను పరిశీలించారు. ఇద్దరు ఉపాధ్యాయులు రాజశేఖర్, గణేష్‌లు సక్రమంగా బోధించకపోవడంతో ఫోన్ ద్వారా వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌ఎం, ఎంఈఓలు, ఇతర విద్యాశాఖ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పాఠశాలలను తనిఖీ చేపట్టకపోవడం వల్ల ఉపాధ్యాయుల బోధన గాడితప్పిందన్నారు. ఎంఈఓ పాఠశాలలు తనిఖీకి వెళ్లినప్పుడు ఉపాధ్యాయుల్లో పొరపాట్లు గుర్తిస్తే వెంటనే డీఈవో, ఆర్‌జేడీలకు ఎందుకు తెలియజేయడం లేదని ప్రశ్నించారు. ఈ విషయమై కొత్తూరు ఎంఈఓ బి.శ్రీధర్, టెక్కలి ఉప విద్యాశాఖాధికారి పగడాలమ్మ, కడుము హెచ్‌ఎం దుర్గాప్రసాద్‌ల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ, హెచ్‌ఎం, ఇద్దరు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఆర్‌జేడీ జ్యోతికుమారిని ఆదేశించారు.

కానరాని పుస్తకాలు..

అనంతరం హిరమండలం మండలంలోని ఎం.అవలంగి గ్రామంలో పర్యటించారు. 4, 5 తరగతుల విద్యార్థుల ఇళ్లకు వెళ్లి విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించారు. 4వ తరగతి ఆంగ్ల సబ్జెక్ట్ వర్క్ బుక్, 3వ తరగతి వాల్యూం పుస్తకాలు విద్యార్థుల వద్ద లేకపోవడాన్ని గుర్తించారు. పుస్తకాల పంపిణీపై డీఈవో తిరుమల చైతన్య, ఎంఈఓ రాంబాబుతో మాట్లాడారు.



సారవకోట: చిన్నకిట్టాలపాడులో పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ

సిలబస్ పూర్తికాకపోవడంపై మండిపాటు..

అనంతరం సారవకోట మండలం చిన్నకిట్టాలపాడులో విద్యార్థుల గృహాలకు వెళ్లి విద్యా ప్రమాణాలను ప్రిన్సిపల్ సెక్రటరీ పరిశీలించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో గణితం సబ్జెక్టులో కొలతలు పాఠ్యాంశం సిలబస్ నేటికీ పూర్తి కాకపోవడాన్ని గుర్తించారు. సోమవారం పరీక్ష ఉన్నా ఇంకా సిలబస్ పూర్తి చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలను పర్యవేక్షించి ఎప్పటికప్పుడు తగిన నివేదికలు ఇవ్వాలని సూచించినా స్పందించకపోవడం, ఇప్పటి వరకు నాలుగు రిపోర్టులు మాత్రమే ఉన్నతాధికారులకు అందజేసినట్లు తేలడంతో ఎంఈఓ ఎం.వి.రమణపై తగిన చర్యలు తీసుకోవాలని డీఈఓను ఆదేశించారు. తుఫాన్ వచ్చింది, పోస్టులు ఖాళీగా ఉన్నాయి, సెలవులు ఎక్కువగా రావడం వల్ల సిలబస్ పూర్తి చేయడం లేదని నివేదికల్లో రాస్తున్నారు తప్ప నిజాయితీగా అందజేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలను పర్యవేక్షించి విధులు సరిగ్గా నిర్వర్తించని వారిపై చర్యలు తీసుకోవాలని సూచించినా ఏ ఒక్కరూ ఆ విధంగా చేయడం లేదన్నారు. ఇకనైనా తీరు మార్చుకోవాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం, కొత్తగా ప్రవేశపెట్టిన రాగిజావ నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టెక్కలి తహశీల్దార్ కార్యాలయంలో రాత్రిబస చేశారు. కార్యక్రమంలో ఏపీసీ జయప్రకాష్, కొత్తూరు తహశీల్దార్ పి.బాల, ఎంపీడీఓ పావని, హిరమండలం తహసీల్దార్ బి.మురళీమోహనరావు, ఎంపీడీఓ శైలజ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్రం



నెలివాడలో ప్రచారభేరి నిర్వహిస్తున్న నాయకులు

రణస్థలం: దేశ సంపదను కార్పొరేట్‌లకు దోచిపెడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని సీపీఎం నాయకుడు సీహెచ్.అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం, సీపీఐ నాయకులు శుక్రవారం నెలివాడలో ప్రచారభేరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఉమ్మడి సంపదగా ఉన్న బ్యాంకులు, ప్రభుత్వ రంగసంస్థలు, వాడరేవులను, ఆఖరికి మన అందరికి అన్నం పెట్టే వ్యవసాయాన్ని సైతం కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందని మండిపడ్డారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాల్సింది పోయి భారీగా కేటాయింపులు తగ్గించేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, ఉపాధిహామీ వేతనదారులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



బెండికొండ వద్ద విద్యుత్ తీగలపై కూలిన మర్రి చెట్టు

వజ్రపుకొత్తూరు: బెండి కొండ దత్తాత్రేయ ఆశ్రమం సమీపంలో గురువారం అర్ధరాత్రి విద్యుత్ తీగలపై భారీ మర్రి చెట్టు విరిగిపడింది. అర్ధరాత్రి కావడం, ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బెండిగేటు కూడలి నుంచి బెండి గ్రామానికి వెళ్లే మార్గంలో 50 ఏళ్లకు పైబడి భారీ మర్రి వృక్షాలు ఉన్నాయి. రోడ్డుకు ఇరువైపులా వీటి కొమ్మలు పట్టు కోల్పోయి రోడ్డుపై తరచూ విరిగి పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ట్రాఫిక్‌తో రద్దీగా ఉన్న సమయంలో ఇలా జరిగితే భారీ నష్టం తప్పదని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు 11 కేవీ విద్యుత్ తీగలపై చెట్టు పడడంతో సిబ్బంది విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. రోడ్డుకు అడ్డంగా చెట్టు పడిపోవడంతో బెండి, వజ్రపుకొత్తూరు, మంచినీళ్లపేట వైపు ట్రాఫిక్ నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని చెట్టు కొమ్మలు తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఆడపిల్లలను కన్నానని

హింసిస్తున్నారు

- హత్యాయత్నానికి పాల్పడిన నా భర్తను అరెస్టు చేయాలి
- ఎస్పీ కార్యాలయంలో వివాహిత ఫిర్యాదు



ఇద్దరు కుమార్తెలతో యశోద

శ్రీకాకుళం క్రైమ్: ఆడపిల్లలను కన్నానని తన భర్త మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి తనపై, తల్లిపై హత్యాయత్నానికి పాల్పడ్డారని, తక్షణమే వారిని అరెస్టు చేయాలని ఓ వివాహిత శుక్రవారం అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు వద్ద మొరపెట్టుకుంది. ఈమెకు మద్దతుగా మహిళా, పౌర, మానవ హక్కుల సంఘాల నేతలు, సభ్యులు తరలివచ్చారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. 2011లో లట్టిగాం గ్రామానికి చెందిన యశోద(30)కు పలాస మండలం జయరామచంద్రపురం గ్రామానికి చెందిన బడ్రి నాగార్జునతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు 11 ఏళ్లు, చిన్న కుమార్తెకు తొమ్మిదేళ్లు. చిన్న కుమార్తె పుట్టినప్పటి నుంచి గొడవలు ప్రారంభమయ్యాయి. ఆడపిల్లలను కన్నావంటూ భర్త తరచూ వేధించేవాడు. మరో వివాహం చేసుకుంటానని, విడాకులు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చేవాడు. వేధింపులు ఎక్కువ కావడంతో పలాస సూదికొండ వద్ద అద్దె ఇంట్లో నివసిస్తున్న తల్లిదండ్రుల వద్దకు యశోద చేరింది. ఈ క్రమంలో ఈ నెల 9న తన భర్త నాగార్జున, పిన్నింటి శేఖర్, మరో ఇద్దరు వ్యక్తులు (మాస్కులు వేసుకుని వచ్చారు) ఇనుపరాడ్డు పట్టుకుని వచ్చి దాడి చేశారని.. గట్టిగా అరవడంతో అమ్మ పరుగెడుతూ వచ్చిందని, ఆమెపైనా దాడి చేశారని బాధితురాలు వాపోయింది. ఈ విషయమై అదే రోజు కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారని తెలిపారు. హత్యాయత్నానికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన అదనపు ఎస్పీ అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. డీపీఐంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు మద్దిలి రామారావు, పౌర హక్కుల నాయకులు ఫకీరు, మానవ హక్కుల నాయకులు కె.వి.జగన్నాథం, మహిళా సంఘాల నాయకులు, సభ్యులు పి.అరుణ, పి.కుసుమ, లోకేశ్వరి, జ్యోతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అంజలిరథంపై అమ్మవారి తిరువీధి

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ఇలవేల్పు స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం అంజలిరథంపై అమ్మవారి తిరువీధి నిర్వహించారు. ఉప్పలవీధిలోని ఉత్సవ మండపం నుంచి కన్నతల్లి సందిరాయని అమ్మవారి వద్దకు చేరుకుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



అమ్మవారి తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

24 నుంచి ఉత్తర కోస్తా సమావేశాలు

శ్రీకాకుళం రూరల్: ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉత్తర కోస్తా మండల వ్యవసాయ పరిశోధన విస్తరణ సలహా మండలి సమావేశాలు ఈ నెల 24 నుంచి 25 వరకు శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల రోడ్డులోని అంబేడ్కర్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు ఉత్తర కోస్తా సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ పి.వి.కె.జగన్నాథరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఆంగ్రూ వ్యవసాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి, విస్తరణ సంచాలకులు సుబ్బిరాంరెడ్డి, ప్రధాన శాస్త్రవేత్తలు, వ్యవసాయ ఉద్యాన అనుబంధ రంగాల అధికారులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు ఆహ్వానం

విశాఖ విద్య: మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకులాల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ దాసరి సత్యారావు కోరారు. సింహాచలంలోని గురుకులంలో ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సుల్లో ఇంగ్లీషు మీడియం బోధనలో విద్యనందిస్తున్నామని తెలిపారు. మే 18 వరకు దరఖాస్తుకు గడువు ఉందన్నారు. మే 28న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

23న బధిర సంఘ సమావేశం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని కత్తెరవీధిలో డ్రగ్ అండ్ కెమిస్ట్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు బధిర సంఘ సమావేశం నిర్వహించనున్నట్లు సంఘ ప్రతినిధి నరేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బధిర సంఘ నూతన కమిటీ సభ్యులను ఎన్నుకుంటామని తెలిపారు. నిరుద్యోగ బధిర యువతీ, యువకులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని సింగుపురం సమీపంలో నీలం జ్యూట్ మిల్లు వద్ద శుక్రవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం కీమటి గ్రామానికి చెందిన అంబటి శ్రీనివాసరెడ్డి (28) మృతి చెందాడు. ప్రకాశం జిల్లా గోకవరం నుంచి శ్రీకాకుళం జిల్లా నిమ్మాడకు గ్రానైట్ రాళ్లు తీసుకొస్తుండగా ఎదురుగా వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా కేబిన్‌లోకి గ్రానైట్ రాళ్లు రావడంతో డ్రైవర్ శ్రీనివాసరెడ్డి ఊపిరాడక అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని సోదరుడు అంబటి వెంకటరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

బ్యాంకులో కుప్పకూలి వ్యక్తి మృతి



మల్లేశ్వరరావు మృతదేహం

బూర్జ: మండలంలోని వావాం పంచాయతీ ఉవ్వపేట గ్రామానికి చెందిన నీలంశెట్టి మల్లేశ్వరరావు (55) బ్యాంకులో కుప్పకూలి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేశ్వరరావు శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో గోల్డ్ లోన్ విషయమై నగదు జమ చేయడానికి వెళ్లాడు. కౌంటర్ దగ్గరకు వెళ్లే సరికి గుండెనొప్పి రావడంతో కుప్పకూలి పడిపోయాడు. బ్యాంకు సిబ్బంది 108 వాహనానికి ఫోన్ చేశారు. సిబ్బంది వచ్చేసరికే మృతిచెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మల్లేశ్వరరావుకు భార్య అప్పలనర్సమ్మ, కుమార్తె ఉన్నారు.

ప్రత్యేక అలంకరణలో బాలత్రిపురసుందరి



బలగలోని నాగావళి నదీ తీరాన బాల త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో శుక్రవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ముందుగా పీఠం నిర్వాహకులు గణేష్ గురుజీ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

పారదర్శకంగా పథకాల అమలు



జీకే వలసలో పథకాల లబ్ధిని వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- గడపగడపకు మన ప్రభుత్వంలో స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: గ్రామ సచివాలయ వ్యవస్థతో వలంటీర్ల ద్వారా పారదర్శకంగా పథకాలు అందుతున్నాయని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మండలం జీకే వలసలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతీ ఒక్క కుటుంబానికి వివక్షకు తావులేకుండా పథకాలు అందిస్తున్నామని చెప్పారు. పథకాల మంజూరులో ఎటువంటి లోపాలు ఉన్నా అక్కడికక్కడే సమస్య పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మరింత అభివృద్ధి బాటలో పయనించాలంటే జీగనన్నకు మరోసారి బాసటగా నిలవాలని కోరారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ద్వారా కోటి కుటుంబాలు సర్వేలో పాల్గొనడం రాష్ట్ర పరిపాలనకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ బెండి గోవిందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మండల సచివాలయాల కన్వీనర్ బొడ్డేపల్లి నిరంజన్, పార్టీ నాయకులు బగ్గు కుమార్, నక్క కన్నబాబు, చేపాన కృష్ణ, గురుగుబెల్లి నీలారావు, మెట్ట ఆనందరావు, సోమరాజు తేజేశ్వరరావు, ఎన్ని రామచంద్రరావు, తిర్లంగి రామారావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరావు, రూరల్ ఏఈ బి.రవికుమార్, ఎంఈఓ దుప్పల రామారావు, ఏఓ మెట్ట మోహనరావు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇచ్చే యజమానులుగా ఎదగాలి

- మేనేజ్‌మెంట్ విద్యార్థులతో ఐఓటీ సీఈఓ రజనీస్ వసంత



రజనీస్ వసంతను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

టెక్కలి: ఎంబీఏ, బీబీఎం, ఇతర మేనేజ్‌మెంట్ కోర్సులు చదువుతున్న ప్రతి విద్యార్థి ఒకరి వద్ద ఉద్యోగం చేసేలా కాకుండా మరో పది మందికి ఉద్యోగాలు కల్పించే వారిగా ఎదగాలని అంతర్ ఐఓటీ సీఈఓ రజనీస్ వసంత ఆకాంక్షించారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చతుర–23 కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో అనుభవం కోసం చిన్న చిన్న వ్యాపారాలు చేయాలన్నారు. కంపెనీలు నిర్వహించే సర్టిఫికెట్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటర్న్‌షిప్‌లో విధిగా పాల్గొనాలన్నారు. కంపెనీకి నాయకత్వం వహించే సామర్థ్యాన్ని విద్యార్థి దశ నుంచి అలవరుచుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ మార్కెట్ స్కిల్స్ నేర్చుకోవడంతో పాటు నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం బీబీఎం, ఎంబీఏ విద్యార్థులకు మార్కెట్ మంత్ర, స్మార్ట్ ఇన్వెస్టర్, జగ్‌మీట్ పోటీలు.. బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులకు క్విజ్, డిబేట్, ఇన్నోవేటర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పద్మావతి డిగ్రీ కళాశాల, గాయత్రీ డిగ్రీ కళాశాల, అంబేడ్కర్ యూనివర్శిటీ విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 200 మంది విద్యార్థులు హాజరైనట్లు కార్యక్రమం కన్వీనర్ బి.శివకుమార్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డి.విష్ణుమూర్తి, డి.విజయ్‌కుమార్, పి.దినకర్, చింతామణి ప్రసాద్ పట్నాయక్, కె.వేణుగోపాల్, డి.బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఆగని టీడీపీ నేతల కవ్వింపు చర్యలు

ఇచ్ఛాపురం రూరల్: ఇరవై ఏళ్ల టీడీపీ పాలనలో జరగని అభివృద్ధి కేవలం నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో జరుగుతుందన్న విషయాన్ని ప్రతిపక్ష పార్టీ జీర్ణించుకోలేకపోతోంది. బరి తెగించి అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తోంది.

గతంలో మశాఖపురం, ఈదుపురం గ్రామాల్లో జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లను అడ్డుకోవడం, గోడలు పడగొట్టడం లాంటి చర్యలకు పాల్పడ్డ టీడీపీ కార్యకర్తలు ఇప్పుడు పాయితారిలో నిర్మిస్తున్న జగనన్న కాలనీపై తమ ప్రతాపం చూపిస్తున్నారు. నిరుపేద వలపల గున్నమ్మ నిర్మించిన ఇంటిపై టీడీపీ కార్యకర్తలు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు. అదే గ్రామానికి చెందిన కొందరు టీడీపీ కార్యకర్తలు తాము నిర్మించిన సిమెంట్ గోడను నేల మట్టం చేశారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సర్పంచ్ లలితా ప్రియా నాయక్, గ్రామ పెద్దలకు శుక్రవారం ఫిర్యాదు చేశారు.



గున్నమ్మ ఇంటి గోడను ధ్వంసం చేసిన దృశ్యం